www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 03 | డిసెంబర్ | 2025 పేజీలు : 7

# సిపిఐకి దక్కిన మరో పంచాయతీ

**-ఊటుకూరు గ్రామ పంచాయతీ ఏకగ్రీవం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రెండవ దశ ఎన్నికల్లో సిపిఐ మరో పంచాయతీని ఏకగ్రీవంగా గెలుచుకుంది. కామేపల్లి మండలం ఊటుకూరు గ్రామ పంచాయతీని ఇతర పార్టీల సహకారంతో సిపిఐ గెలుచుకుంది. మొత్తం 10 వార్డులు ఉండగా కాంగ్రెస్ నాలుగు, బిఆర్ఎస్ మూడు, సిపిఎం రెండు, సిపిఐ ఒక వార్డు తీసుకుని సర్పంచ్ స్థానాన్ని సిపిఐకి కేటాయించారు. సర్పంచ్ అభ్యర్థిగా ఈసం హన్మంతరావు ఒక్కరే నామినేషన్ వేయడంతో పంచాయతీ ఏకగ్రీవమైంది. 1986లో సిపిఐకి చెందిన ఈసం బుచ్చయ్య ఊటుకూరు గ్రామ పంచాయతీని ఏకగ్రీవంగా గెలుచుకోగా దాదాపు 39 సంవత్సరాల తర్వాత సిపిఐ తిరిగి ఆ పంచాయతీని ఏకగ్రీవంగా దక్కించుకుంది. ఈసం బుచ్చయ్య మనవడు ఈసం హన్మంతరావు ఇప్పుడు సర్పంచ్ పదవిని దక్కించుకున్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ఏపూరి లతాదేవి స్వగ్రామం ఊటుకూరు కావడం విశేషం. ఆమె గత కొంత కాలంగా ఊటుకూరు గ్రామ పంచాయతీలో సిపిఐ అభ్యర్థిని గెలిపించుకునేందుకు పావులు కదిపి సఫలీకృతమయ్యారు. ఈ సందర్భంగా ఏపూరి లతాదేవి మాట్లాడుతూ సిపిఐ అభ్యర్థిని ఏకగ్రీవంగా గెలిపించిన అన్ని రాజకీయ పార్టీలకు, ఊటుకూరు గ్రామ ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని ఆమె తెలిపారు.

# తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చిన మన్మోహన్ సింగ్

- విద్యా వ్యవసాయంతోనే అభివృద్ధి
- అభివృద్ధి చేసే వారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోండి
- కొత్తగూడెం సభలో సిఎం రేవంత్ రెడ్డి
- డా.మన్మోహన్ సింగ్ భూ విజ్ఞాన విశ్వవిద్యాలయం ప్రారంభం







2 లో

# నిబంధనల మేరకు అత్యధిక పరిహారం

**-పరిహారంపై రైతులతో చర్చించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సీతారామ ఎత్తిపోతల పథకం సంబంధించి భూ సేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం ఇవ్వడానికి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సింగరేణి మండలం బాజుమల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణ పరిహారం నిర్ధారణకు సంబంధిత రైతులతో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగరేణి మండలం బాజుమల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా, భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామని, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించామని తెలిపారు. ప్రాజెక్టు రావాలని, అదేవిధంగా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి భూ సేకరణ చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రాజెక్టుతో సాగునీరు అంది అక్కడి భూములు సారవంతమవుతాయన్నారు. ఉన్న దానిలో మంచి ధర ఇచ్చేవిధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. బాజుమల్లాయిగూడెం గ్రామంలో ఎకరానికి రూ.2.70 లక్షలు ఉందని భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా రూ. 5.40 లక్షలు చెల్లించాల్సిం ఉండగా

మిగతా 2లో..

# దట్ ఈజ్ తుమ్మల..!

**- ఆయన తీరు ప్రశంసనీయం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాదు రాష్ట్ర రాజకీయాల్లోనూ ప్రస్తుత వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుది ప్రత్యేక శైలి. మాట తీరుతోనే కాదూ తనకున్న ప్రత్యేకమైన ఎజెండాతో తన కంటూ ప్రత్యేకతను చాటుకుంటారు. మంగళవారం కొత్తగూడెంలో భారత మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ భూ విజ్ఞాన విశ్వవిద్యాలయం ప్రారంభం సందర్భంగా సభా అధ్యక్షునిగా సభను నడిపించిన తీరు ఆధ్యాంతం ఆకట్టుకుంది. హెలీకాప్టర్ సాంకేతిక లోపం కారణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుమారు 3 గం. ఆలస్యంగా వచ్చారు. తిరిగి వెళ్లేందుకు తగినంత వెలుతురు ఉండదనే ఆలోచనతో కేవలం 35 నిమిషాల్లోనే సభను ముగించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాకు అవసరమైన వాటి గురించి ముఖ్యమంత్రికి ఏకరవు పెడుతూనే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు లను రెండు నిమిషాలు మాత్రమే ప్రసంగించాలంటూ ఆయన చెప్పిన తీరు ఆకట్టుకుంది. తగిన సమయం లేకున్నప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విశిష్టతను తెలుపుతూనే ఇక్కడి ప్రజల సామూహిక అవసరాలను, ప్రాజెక్టులు, రైల్వే లైను, విమానాశ్రయం, థర్మల్ విద్యుత్ కేంద్రం, మొదలగు వాటి ఏర్పాటు ఆవశ్యకతను సభ దృష్టికి తీసుకొచ్చారు. 40సం.లకు పైగా రాజకీయ అనుభవం ఉన్న తుమ్మల ఏ విషయంలోనైనా నిక్కచ్చిగా, నిర్మోహమాటంగా మాట్లాడుతూ తన అభిప్రాయాన్ని కుండ బద్దలు కొట్టినట్లు చెబుతారు. అది మంత్రివర్గ సమావేశం అయినా, పార్టీసభ అయినా, బహిరంగ సభ అయినా తన అభిప్రాయాన్ని చెప్పేందుకు వెనుకాడరు. ప్రభుత్వ పథకాల్లో లోటుపాట్లను సైతం ఎత్తి చూపడంలోనూ తన దైనశైలిని తుమ్మల ప్రదర్శిస్తుంటారు. ఛలోక్తులను సైతం సానుకూలంగా విసరడంలో ఆయన ధిట్టా. ఆయన తొలి ప్రాధాన్యతను వ్యవసాయ రంగానికి ఇస్తారు. గ్రామీణ నేపథ్యం గల వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన తుమ్మల ఏ ప్రభుత్వంలో అయినా, ఏ శాఖ ను నిర్వహించినా ఆయన ప్రాధాన్యత మాత్రం వ్యవసాయ పురోభివృద్ధికే అన్నది అందరికీ తెలిసిందే. అలాగే విద్యార్జన ద్వారా ఉన్నత స్థానాలకు ఎదగడంతో పాటు ఆర్థికంగా బలపడతారన్న ఆలోచనతో విద్యా రంగాన్ని ప్రోత్సహిస్తుంటారు. సంపాదించుకునే అవకాశాన్ని కల్పించాలే తప్ప ఉచితంగా ఏదీ అందించ రాదనే భావనను కలిగుండే తుమ్మల పలు సందర్భాల్లో దీనిని బహిర్గతం చేశారు. అందుకే తుమ్మల అంటే తుమ్మలే అంటుంటారు. దట్ ఈజ్ తుమ్మల

# తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చిన మన్మోహన్ సింగ్









**ప్రజాపక్షం/ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం :** 60సం.ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రధాన మంత్రి హోదాలో నెరవేర్చిన మహోన్నతుడు డా.మన్మోహన్ సింగ్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు, ఉద్యమానికి ఆలోచనా బీజం పాల్వంచ కేంద్రంగా పడిందని, 60 ఏళ్ల సుదీర్ఘ కలను నెరవేర్చిన మన్మోహన్ పేరు భూ విజ్ఞాన విశ్వవిద్యాలయానికి పెట్టడం గర్వకారణం అన్నారు. మంగళవారం దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన భూ విజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభంచారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో రేవంత్ మాట్లాడుతూ ఈ యూనివర్సిటీ దేశానికి తలమానికం కానుందన్నారు. ఈ దేశాన్ని సంక్షోభం నుండి సంక్షేమం వైపు నడిపించి అభివృద్ధిలో అగ్ర స్థానంలో నిలిపిన మన్మోహన్ సింగ్ చిరస్మరణీయులన్నారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రు విద్య,నీటి పారుదల సౌకర్యాల కల్పనతోనే దేశం అభివృద్ధి చెందుతుందని భావించారని, ఆయన పరిపాలనా కాలంలోనే నాగార్జున సాగర్, ఎస్ఆర్ఎస్‌పి, బాక్రానంగల్, శ్రీశైలం లాంటి ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయన్నారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం ఉన్నత లక్ష్యాలతో రాష్ట్రాన్ని ప్రపంచంతో పోటీ పడే విధంగా ముందుకు తీసుకెలుతుందన్నారు. యంగ్ ఇండియా స్కూల్స్ నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. గత 10 సం.పాటు తెలంగాణలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆయన ఆరోపించారు. త్వరితగతిన ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, రాష్ట్రంలోనే కృష్ణ, గోదావరి నదులతో సాగు, తాగు నీరు అందించే అవకాశం ఉమ్మడి ఖమ్మం జిల్లాకే దక్కిందని ఆయన తెలిపారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ చీరలు, మహిళకు ఉచిత బస్ ప్రాయాణం, రూ.500 లకే గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి తదితర సంక్షేమ పథకాలతో ప్రజల ముందుకు వస్తున్నామని, 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఈనెల 8,9 తేదీల్లో ఆవిష్కరించనున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజాప్రభుత్వానికి ఖమ్మం జిల్లా ఆయువు పట్టుగా ఉందని, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖా మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు ఈ ప్రభుత్వానికి ఆయువు పట్టుగా ఉన్నారని, ఏ కార్యక్రమాన్నైనా చేయగలిగే అవకాశం వారి చేతుల్లోనే ఉందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉందని, ఇక్కడి ప్రజలు ఓటు అనే ఆయుధంతో ప్రభుత్వాన్ని నడిపించే అవకాశం కాంగ్రెస్‌కు ఇచ్చారని చెప్పారు. ఈ జిల్లా ప్రజల రుణం తీర్చుకునేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రానున పంచాయితీ ఎన్నికల్లో అభివృద్ధి చేసేవారినే ఎన్నుకోవాలని, అభివృద్ధి నిరోదకులకు, మందుకు, డబ్బులకు లొంగకుండా అభివృద్ధి కాముకులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈసభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావులు ప్రసంగించగా ఇంచార్జ్ మంత్రి వాకాటి శ్రీహరి, ఎంపిలు రామసహాయం రఘురామిరెడ్డి, పోరిక బలరామ్ నాయక్, ఎంఎల్ఏలు కోరం కనకయ్య, డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, రామ్‌దాస్ నాయక్, మట్టా రాగమయి, జారే ఆదినారాయణతో పాటు వివిధ కార్పోరేషన్ల చైర్మన్‌లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, పొదెం వీరయ్య, మువ్వా విజయ్‌బాబు, పసుపులేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకు అత్యధిక పరిహారం

(మొదటిపేజీ తరువాయి)



ప్రభుత్వం దానిపి పెంచి రూ. 10.80 లక్షలు చెల్లించాలని నిర్ణయించిందని, ఆర్బిట్రేషన్‌లో 12 శాతం వడ్డీ క్రింద రూ.64వేలు కలిపి మొత్తం రూ. 11.44 లక్షలు ఒక ఎకరానికి చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా రేలకాయలపల్లి గ్రామంలో ఎకరానికి రూ. 2.92లక్షలు ఉందని భూ సేకరణ చట్టం ప్రకారం రెండింతలు అనగా రూ. 5.85 లక్షలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం పెంచి రూ. 11.70 లక్షలు చెల్లించాలని నిర్ణయించిందని, ఆర్బిట్రేషన్‌లో 12 శాతం వడ్డీ క్రింద రూ. 70390 కలిపి రూ.12,40,390 ఎకరానికి చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీనికి రైతులు మరింత పెంచాలని కోరారని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిలో ఉన్న వ్యవసాయ పంపుసెట్లు, చెట్లు, సుబాబుల్ చెట్లు, ఇతర నిర్మాణాలకు సపరేటుగా పరిహారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌గా తనకున్న అధికారాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ట పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు, భూ నిర్వాసిత రైతులందరూ అంగీకరించి భూసేకరణకు సహకరించాలని ప్రభుత్వం నుంచి పరిహారం త్వరితగతిన అందేలా చూస్తానని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ తమ భూముల్లో సుబాబుల్ పంట వేశామని పంట చేతికొచ్చే సమయానికి భూములు కోల్పోవడం వల్ల జీవనోపాధి కోల్పోతున్నామన్నారు. సుబాబుల్ పంట జీవిత కాలాన్ని పరిగణలోకి తీసుకుని తదనుగుణంగా పరిహారం ఇవ్వాలన్నారు. భూమిలో ఉన్న పైపులైన్, చెట్లు, ఇతర పరికరాలు, డ్రిప్ సిస్టం వివరాలు సరిగ్గా నమోదు చేసి పరిహారం అందించాలన్నారు. అందరికీ ఒకేసారి పరిహారం అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ భూ సేకరణ అధికారులు, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

# మండలంలో జోరుగా నామినేషన్లు





**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండలంలో మంగళవారం జోరుగా నామినేషన్ ప్రక్రియ సాయంత్రమైనా కొనసాగుతూనే ఉంది. మంగళవారం మంచి గడియలు అని అన్ని పార్టీల వారు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లకు రావడంతో ఆయా నామినేషన్ల కేంద్రాల వద్ద సందడి నెలకొంది. రాత్రి 10గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగే అవకాశం ఉండటంతో పూర్తి స్థాయిలో సమాచారం అందలేదు. ప్రతి పార్టీ నుండి ఒక్కొ వార్డుకు రెండు నామినేషన్లు వేస్తున్నారు. నామినేషన్ల విత్ డ్రా అనంతరమే బరిలో ఎవరెవరు ఉంటారనేది స్పష్టంగా తెలుస్తుంది.

## వైరా రిజర్వాయర్‌లో 8.55లక్షలు ఉచిత చేప పిల్లలు విడుదల



**ప్రజాపక్షం/వైరాః** వైరా రిజర్వాయర్‌లో మంగళవారం ప్రభుత్వం ద్వారా ఇచ్చే ఉచిత చేప పిల్లలు 8.55లక్షలు విడుదల చేయడం జరిగింది. ఈ క్యాక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి జి.శివప్రసాద్, నీటిపారుదలశాఖ ఏఈ వెంకటరామ, సంఘ అధ్యక్షులు షేక్ రహీం, కార్యదర్శి షేక్ రహీం, ఉపాధ్యక్ష్ఉడు సైదులు, పాలకవర్గ సభ్యులు జాన్‌మియా, ఉద్దండు సాహెబ్, నాగరత్నం, రామారావు, చాంద్‌మియా, సంఘ సభ్యులు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించిన తాతా మధు



**ప్రజాపక్షం/వైరాః** వైరా సుందరయ్యానగర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన చింత నిప్పు సుధాకర్ చిత్రపటానికి టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, వైరా పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, మాదినేని దుర్గాప్రసాద్, ఏదునూరి శ్రీనివాసరావు, ఆదూరి ప్రేమ్‌కుమార్, నందిగామ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని యువకుడు మృతి



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆగి ఉన్న కారును ఢీ కొని ఓ యువకుడు మృతి చెందన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పాల్వంచ నుండి భద్రాచలం వైపుకు వెళుతున్న ఓ కారు మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామ సమీపంలో మొక్కజొన్నకంకులు తీసుకునేందుకు డ్రైవర్ కారును నిలిపి కుడివైపు కారు డోర్‌ను అజాగ్రత్తగా తెరిచాడు. ఈ క్రమంలో వెనుక నుండి వస్తున్న ఓ మోటర్ సైకిల్ కారును గమనించకుండా ఒక్క సారిగా బలంగా ఢీ కొట్టిది. దీంతో మోటార్ సైకిల్ నడుపుతున్న సగ్గు రాఘవేంద్రరెడ్డి (24) అక్కడికక్కడే మృతి చెందగా, ఆవుల మహేష్ రెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతుడు బూర్గంపాడు మండలం మొంరపల్లి బంజర్ గ్రామానికి చెందిన వాడు. రాఘవేంద్ర రెడ్డి మృతితో ఆ కుటుంబంలో విషాధఛాయలు అలుముకున్నాయి. మృతిని బావ రోళ్ల పుల్లారెడ్డి ఫిర్యాదు మేరకు సారపాకకు చెఎందిన కారు డ్రైవర్ రఘునాథ రెడ్డిపై పాల్వంచ్ రూరల్ హెడ్ కానిస్టేబుల్ ఎన్ కృష్ణ కేసు నమోదు చేశారు.

# జిల్లా అధ్యక్షున్ని చేసినందుకు కృతజ్ఞతలు

**-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా అవకాశం కల్పించినందుకు ఏఐసిసి బాధ్యులకు, ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా డిసిసి అధ్యక్షులుగా తాను పదవి బాధ్యతలు చేపట్టే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ఆశీర్వదించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లా అంటే కాంగ్రెస్ కంచుకోట అని స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి మరో మారు రుజువు చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అత్యధిక పంచాయతీల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లాను రోల్ మోడల్‌గా నిలపాలన్నారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పిసిసి సభ్యులు మహ్మద్ జావిద్, నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, కార్పోరేషన్ ఛైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మాజీ శాసన సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సిలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పులిపాటి వెంకయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# ఏకగ్రీవాలపై కసరత్తు

**-ఉపసంహరణలపై నాయకుల దృష్టి**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి బుధవారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు కావడంతో వివిధ పార్టీల నాయకులు నామినేషన్ల ఉపసంహరణలపై దృష్టి సారించారు. రఘునాథపాలెం మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీల పరిధిలో 308 వార్డులు ఉన్నాయి. డిసెంబర్ 11న ఎన్నికలు జరగనున్నాయి. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండడంతో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు వేసిన వారిని ఉపసంహరించేందుకు నాయకులు కసరత్తు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలను ఏకగ్రీవం చేసేందుకు పార్టీలు ఓ అవగాహనను కుదుర్చుకుంటున్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు సర్పంచ్, ఉప సర్పంచ్ లను చెరొక పార్టీ తీసుకునేలా చర్చలు సాగుతున్నాయి. మండలంలో ఐదారు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా ఎక్కువ నామినేషన్లు వేసిన గ్రామాల్లో అభ్యర్థులను ఉపసంహరించేందుకు ఆయా పార్టీల నాయకులు చర్చలు జరుపుతున్నారు. ఏకగ్రీవం చేసుకుంటే ఎన్నికల ఖర్చు కూడా ఉండదంటూ నాయకులు ఆలోచిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో త్రిముఖ, ద్విముఖ పోటీలు ఉండే అవకాశం ఉంది.

## కొత్త వెంకటగిరి కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా దీవెల వెంకటేశ్వరరావు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని కొత్త వెంకటగిరి గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దీవెల వెంకటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉండేందుకు సిద్ధమయ్యారు. ఆయన గత 35 ఏళ్లుగా సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపారు. నీటి సంఘం డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. కాంగ్రెస్‌లో ఎంతో అనుభవం ఉండటంతో ఆనాడు మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు సహకారంతో నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపారు. ఈ ఎన్నికల్లో పంచాయతీ జనరల్‌కు రావడంతో ఆయన సర్పంచ్‌గా పోటీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ గ్రామంలో కార్యక్రమాలు చేపడుతుండటం ఆయనకు కలిసివచ్చే అంశం. స్వర్గీయ జక్కంపూడి కృష్ణమూర్తి నమ్మకస్తుడిగా ముఖ్య అనుచరుడుగా వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ దీవెల కృష్ణయ్య కూడా సోదరుడు కావడంతో పాటు వారికి ముఖ్య అనుచరుడిగా ఉంటూ పార్టీ బలోపేతం కోసం కృషి చేశారు. గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సర్పంచ్ పోటీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆయన అభ్యర్థిగా ఉంటే గెలుపు సునాయాసం అవుతుందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ నెల 3న నామినేషన్ కు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

## వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, మధిర టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిరియాల వెంకటరమణగుప్తా సతీమణి లావణ్య పుట్టిన రోజు సందర్భంగా మధిర ఆర్కే ఫౌండేషన్ అనాధాశ్రమం, మదర్‌థెరిస్సా వికలాంగుల సేవాసదనం నందు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంతో డబ్బు ఖర్చుపెట్టి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకుంటున్న ఈ రోజుల్లో ఆ డబ్బుతో బీదవారికి, అనాధులకు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేయడం పట్ల పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందించారు. ఈసందర్భంగా లావణ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాసదనాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అయ్యప్పస్వామి పల్లివేట ఉత్సవం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని లడకబజార్ అయ్యప్పనగర్‌లో వేంచేసియున్న శ్రీ అయ్యప్ప స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అయ్యప్పస్వామి పల్లివేట ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి అయ్యప్ప స్వాములు భజనలు చేస్తూ ఘనంగా ఊరేగించారు. స్వామి వారి ఆలయాన్ని నిర్మించి 18 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పల్లివేట కార్యక్రమంలో కేరళ నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన వాయిద్య బృందాలు, డీజే వాహనం, కోలాట బృందాలు, మహిళలు, మాలదారులు స్వామి వారి పాటలతో మధిర పురవీధుల్లో స్వామి వారి పల్లివేట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు చలువాది ధర్మారావు, చలువాది శ్రీనివాసరావు, దేవిశెట్టి రంగారావు, గురుస్వాములు వంకాయలపాటి వెంకటనాగేశ్వరరావు, బత్తుల శ్రీనివాసరావు, చెరుపల్లి శ్రీధర్, పాసికంటి గాంధీ, భాస్కర్‌స్వామితో పాటు పెద్ద ఎత్తున అయ్యప్పలు, భక్తులు పాల్గొన్నారు.

## సర్వజ్ఞలో కాలుష్య నివారణ దినోత్సవం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలోని సర్వజ్ఞ పాఠశాలలో జాతీయ కాలుష్య దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కాలుష్యం నియంత్రణ దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. స్థానిక స్థాయిలోనే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు కాలుష్యం నియంత్రణ అనే అంశంపై చిన్న నాటిక ప్రదర్శించి, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కలిగించారు. కాలుష్యం నియంత్రణ మార్గాలు, చెట్ల ప్రాధాన్యం, పర్యావరణ సంరక్షణ వంటి అంశాలపై సూచనలు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులచే కాలుష్య నివారణకి తీసుకునే జాగ్రత్తలపై పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అయ్యప్ప మాల ధరించిన స్వాముల ఇరుముడి కార్యక్రమం చిమ్మపుడి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామంలో అయ్యప్ప మాల ధరించిన 38 మంది స్వాములు శబరిమలైలోని అయ్యప్ప స్వామిని దర్శనం కోసం వెళ్లేందుకు ఇరుముడి కట్టించుకునే కార్యక్రమం గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. బిఆర్‌ఎస్ తరుపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుత్తా రవి ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. శబరిమలై వెళ్తున్న స్వాముల ప్రయాణ విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇరుముడి సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో దొంతు సత్యనారాయణ, గొర్రె శ్రీనివాసరావు, వార్డు అభ్యర్థులు గుండ్ల ముత్తయ్య, కాశంగి వీరబాబు, మద్దుల నాగేశ్వరరావు, ఎర్ర వెంకటరెడ్డి, డి. వెంకటేశ్వర్లు, ఎస్. వీరబాబు, ఆర్. రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మల్లవరం సర్పంచ్ అభ్యర్థిగా కటికి కిరణ్



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం మల్లవరం గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కటికి కిరణ్‌కుమార్ ఈ నెల 4న నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. తల్లాడ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షత హోదాలో మల్లవరం గ్రామంలో తల్లాడ మండలంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని కాంగ్రెస్ పార్టీ ఆదేశానుసారం అనేక కార్యక్రమాలు చేపట్టి సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ విజయం కోసం, మల్లవరం గ్రామ కాంగ్రెస్ పార్టీ కోసం ప్రత్యేకమైన పాత్ర పోషించిన వారిలో కటికి కిరణ్‌కుమార్ చాలా ప్రముఖుడు. మల్లవరం గ్రామ ప్రజల ఆశీస్సులతో ఈ నెల 4న తేదీన కటికి కిరణ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ తరుపున నామినేషన్ వేయనున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు.

## తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ బరిలో దగ్గుల రఘుపతిరెడ్డి



**ప్రజాపక్షం/ తల్లాడ :** బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి ఈ నెల 4న తల్లాడ మేజర్ పంచాయతీ కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. ఎన్నో సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృష్ణపడి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు క్రమం తప్పకుండా పార్టీ కార్యక్రమాలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పెద్దల నుంచి మహోన్నతమైన పేరు ప్రఖ్యాతలు సాధించిన బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి సత్తుపల్లి ఎమ్మెల్యే, టిపిసిసి జనరల్ సెక్రటరీ మట్టా రాగమయి దయానంద్ గెలుపు పాత్రలో ప్రత్యేకమైన కృషి చేశారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి ఆనాటి టిఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ తరుపు నుంచి ఎంపిటిసిగా గెలిచి ప్రజల మనస్సును గెలుచుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి దగ్గుల రఘుపతిరెడ్డి పేరు ప్రజల్లో ఉండగానే పలువురు ఆనందం వ్యక్తం చేస్తూ వారికి ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు.

## తల్లాడ ప్రజా పరిషత్ హెల్ప్ డెస్క్‌ను సందర్శించిన సబ్ కలెక్టర్




**ప్రజాపక్షం/ తల్లాడ :** స్థానిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల నామినేషన్లు, ఎన్నికలు ఏర్పాట్ల ప్రక్రియ తల్లాడ ఎంపిడిఓ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ వారీగా మెటీరియల్ సెగ్రేషన్ చేస్తున్నామని, ఎంపిడిఓ సురేష్‌బాబు తెలిపారు. ఈ పర్యటనలో కల్లూరు డీఎల్‌పిఓ తల్లాడ తహశీల్దార్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్‌రే మిషన్ కొనుగోలుకు టెండర్ల ఆహ్వానం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎక్స్‌రే మిషన్ కొనుగోలుకు జిల్లా కలెక్టర్ అనుమతితో ఆఫ్ లైన్ టెండర్లను ఆహ్వానిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధీకృత విక్రేతలు షార్ట్ టెండర్‌ను సిల్డ్ కవర్‌లో ఈనెల తొమ్మిది సాయంత్రం ఐదు గంటల లోపు కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. తక్కువ ధర సూచించిన ఏజెన్సీకి ఈనెల 10న మధ్యాహ్నం రెండు గంటలకు టెండర్ ఫైనల్ చేయనున్నట్లు డిఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు. షార్ట్ టెండర్‌లో పాల్గొనే వారు ఈఎండి రూ. 50వేలు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఖమ్మం పేరున డిడి ద్వారా చెల్లించాలన్నారు. ఎక్స్‌రే మిషన్ పూర్తి సాంకేతిక స్పెసిఫికేషన్ కొరకు డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## అన్నిదానాల కంటే అన్నదానం మిన్న



**ప్రజాపక్షం/ మధిర :** అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అని మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన రంగా హన్మంతరావు అన్నారు. మంగళవారం ఆత్కూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. రంగా హన్మంతరావు, మధులత, మండవ కిషోర్, వెంకటలక్ష్మి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని రంగా రాఘవ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చే విధంగా ప్రతి మంగళవారం ఆత్కూరు ఆంజనేయస్వామి వద్ద దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమంలో పాల్గొనాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఆడంబరాలకు మితిమీరిన ఖర్చులు చేయకుండా పేదల ఆకలి తీర్చే విధంగా అన్నదానాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో దాతలు, భక్తులు పాల్గొన్నారు.

## భగవద్గీత శ్లోకాలు విజేతలుగా భరత్ స్కూల్ విద్యార్థులు



**ప్రజాపక్షం/ మధిర :** గీత ప్రచార పరిషత్ మధిర వారి ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా భగవద్గీత శ్లోకాల పఠన, రామాయణం యుద్ధకాండ నుంచి ప్రశ్నలు విభాగం నందు మధిర పట్టణంలోని భరత్ విద్యానికేత్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి బహుమతులు గెలుపొందారు. జూనియర్స్ విభాగంలో శ్లోకాల పఠనం విభాగం నందు నాల్గొవ తరగతికి చెందిన మిరియాల నిషిత మొదటి బహుమతి, అత్విత మూడవ బహుమతి,రామయణం యుద్ధంకాండ నుండి క్విజ్ విభాగం నందు ఏడవ తరగతికి చెందిన ఝాన్సీరాణి మొదటి బహుమతి, చిన్మయి ద్వితీయ బహుమతి, సీనియర్స్ విభాగం నందు విరాట పర్వం క్విజ్ విభాగం నందు తొమ్మిదవ తరగతికి చెందిన సాయి ప్రణీత మొదటి బహుమతి 8వ తరగతికి చెందిన భవ్యశ్రీ ద్వితీయ బహుమతి, మహిషాసురమర్దిని శ్లోకాలు యందు ఏడవ తరగతికి చెందిన చిన్మయి, మూడవ బహుమతి గెలుపొందినట్లు విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు పద్మావతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కర్నాటి అనూషకు గోల్డ్‌మెడల్ రావటం తల్లాడకే గర్వకారణం



**ప్రజాపక్షం/ తల్లాడ :** మైసూర్ దత్తపీఠం నిర్వహించిన భగవద్గీతలోని 18 అధ్యాయాలు, 700శ్లోకాల కంఠస్థ పోటీ పరీక్షలో ఖమ్మంజిల్లా తల్లాడకు చెందిన కీర్తిశేషులు నన్నపునేని వెంకటయ్య పెద్దకూతురు కర్నాటి అనూష అత్యున్నతమైన ఉత్తమ శ్రేణి స్థానాన్ని దక్కించుకుని అవధూత పూజ్య శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. కర్నాటి అనూషకు గోల్డ్ మెడల్ రావడంతో స్థానిక ప్రముఖులు, బిజెపి నాయకులు ఆపతి వెంకటరామారావు తదితరులు ఆమెను అభినందించారు. భగవద్గీత అధ్యయనం వృత్తిలో ప్రతిభ చూపిన కర్నాటి అనూష పట్టుదల, నిబద్ధత తల్లాడ గ్రామం పట్ల గర్వకారణమే కాకుండా నేటి యువతకు ఆదర్శంగా నిలిచిందని పలువురు ప్రశంసించారు.

## గోవిందాపురం సర్పంచ్‌గా కళావతి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం గోవిందాపురం గ్రామపంచాయతీ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా రంగిశెట్టి కళావతి ఏకగ్రీవంగా ఎన్నిక, వైస్ సర్పంచ్‌గా గుజ్జర్లపూడి నాగభూసణం, వార్డు మెంబర్1 బండి శ్రీలత, 2.ఓర్సు కృష్ణ, 3.పల్లపు ఉపేంద్ర, 4.పెరుమాళ్లపల్లి వెంకయ్య, 5.వేముల ఉషారాణి, 6.గుజ్జర్లపూడి నాగభూషణం, 7.సాలె మరియమ్మ, 8.రామాల దీపిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## సింగరేణి మండలంలో స్థానిక ఎన్నికల నామినేషన్‌కు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో ఉన్న 41 గ్రామ పంచాయితీకి స్థానిక ఎన్నికల నామినేషన్‌కి అధికారులు తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. నామినేషన్‌కి వచ్చే అభ్యర్థులకు గానీ కార్యకర్తలకు గానీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నారు. అదే విధంగా నామినేషన్ కార్యక్రమం జరిగే అన్ని కూడా ఎలక్షన్ కోడ్‌కు లోబడి నామినేషన్ వేసే విధంగా గ్రామాలలో ఉన్న అన్ని పార్టీల నాయకులతో వివరంగా చెప్పడం జరిగింది. 41 గ్రామ పంచాయితీలకు నామినేషన్‌కు 13 సెంటర్లను కేటాయించారు. సింగరేణి గ్రామ పంచాయితీ కార్యాలయం నందు సింగరేణి, అప్పైగూడెం గ్రామ పంచాయితీ సంబంధించిన అభ్యర్థులు నామినేషన్ వేయాలని, గేట్ కారేపల్లి గ్రామ పంచాయితీ నందు గేట్ కారేపల్లి, రేగులగూడెం, దుబ్బతండ గ్రామ పంచాయితీ అభ్యర్థులు నామినేషన్ వేయాలని, కొత్తకమలాపురం గ్రామ పంచాయితీ నందు కొత్త కమలాపురం, పాత కమలాపురం, గంగారం తండా గ్రామ పంచాయితీలు నామినేషన్ వేయాలని, పేరుపల్లి గ్రామ పంచాయితీ నందు పేరుపల్లి గ్రామ పంచాయితీ నందు పేరుపల్లి సూర్యతండా రావోజీ తండా సంబంధించిన అభ్యర్థులు నామినేషన్ వేయాలని, మాదారం గ్రామ పంచాయితీ నందు మాదారం కొత్తతండా, గుంపెళ్ళగూడెం, మంగళ్‌తండా సంబంధించిన అభ్యర్థులు నామినేషన్ వేయాలని, భాగ్యనగర్ తండా గ్రామ పంచాయితీ నందు భాగ్యనగర్ తండా, గుట్టకింద గుంపు, పోలంపల్లి అభ్యర్థులు నామినేషన్ వేయాలని, సీతారాంపురం గ్రామ పంచాయితీ నందు సీతారాపురం, ఉసిరికాయలపల్లి, చిన్నమ్మడంపల్లి, తొడితెలగూడెం గ్రామ పంచాయితీ అభ్యర్థులు నామినేషన్ వేయాలని, కొమ్ముగూడెం పంచాయితీ నందు కొమ్ముగూడెం, గాదెపాడు, కోమట్లగూడెం గ్రామ పంచాయితీ అభ్యర్థులు నామినేషన్ వేయాలని, మాణిక్యారం గ్రామ పంచాయితీ నందు మాణిక్యారం, మొట్లగూడెం, ఎర్రబోడు గ్రామ పంచాయితీ అభ్యర్థులు నామినేషన్ వేయాలని, విశ్వనాథపల్లి గ్రామ పంచాయితీ నందు విశ్వనాథపల్లి, బజ్యతండా, గిద్దవారిగూడెం, వెంకటయ్యతండా అభ్యర్థులు నామినేషన్ వేయాలని, రేలకాయలపల్లి గ్రామ పంచాయితీ నందు రేలకాయలపల్లి, జైత్రం తండా, గేటురేలుకాయలపల్లి అభ్యర్థులు నామినేషన్ వేయాలని, చీమలపాడు గ్రామ పంచాయితీ నందు చీమలపాడు, బోటి తండా, నానునగర్ తండా అభ్యర్థులు నామినేషన్ వేయాలని, బాజుమల్లైయిగూడెం గ్రామ పంచాయితీ నందు బాజుమల్లైయిగూడెం, పాటిమీద గుంపు, ఢంపు అభ్యర్థులు నామినేషన్ వేయాలని ఎంపీఓ తెలిపారు.


## ఆదివాసీ గ్రామ పంచాయతీలపై గిరిజనేతరుల కుట్ర

**-ఇంటీరియం ఆర్డర్ ఏజెన్సీ చట్టాలకు విరుద్ధం**
**-రిజర్వేషన్ ప్రకారమే పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలి**
**-ఆదివాసి నాయకుల డిమాండ్**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** రాజకీయ లబ్ధి కోసం ఆదివాసి గ్రామ పంచాయితీల పై గిరిజనేతరులు కుట్రలు చేస్తున్నారని జై ఆదివాసీ యువశక్తి నాయకులు కాలం నరసింహారావు, ఇరప రామారావు, వాడే నరసింహారావులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో ఆదివాసి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ భారత రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం 1950 నాటినుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జూలూరుపాడు, గౌరారం, సాప్రాలపల్లి గ్రామపంచాయితీలు షెడ్యూల్ ప్రాంతంగా గుర్తించబడిందని వారు తెలిపారు. ఏజెన్సీ చట్టాలు, హక్కుల ప్రకారం ఈ ప్రాంతంలో గిరిజనులకే రిజర్వేషన్ అర్హతను భారత రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. కానీ గిరిజనేతరులు తమ రాజకీయ లబ్ధికోసం షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసి గ్రామాలలో సర్పంచ్ ఎన్నికను ఆపుటకు తప్పుడు సమాచారంతో ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించి ఇంటీరియం ఆర్డర్ తేవడం బాధాకరమన్నారు. ఇది ముమ్మాటికి గిరిజన హక్కులను కాలరాసే కుట్రగా ఆదివాసీలంతా చూడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు కల్పించిన చట్టాలను, హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఉన్నత న్యాయస్థానాలకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని వారు గుర్తు చేశారు. కావున ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, తెలంగాణ హైకోర్టు నందు కౌంటర్ దాఖలు చేసి, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జూలూరుపాడు, గౌరారం, సాప్రాలపల్లి పంచాయితీలకు సర్పంచ్ ఎన్నికలు గిరిజన అభ్యర్థుల రిజర్వేషన్ ప్రకారమే నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముక్తి రమేష్, ఈసం రాము, గడిగా లెనిన్, ముక్తి వెంకటేశ్వర్లు, ఈసం బుచ్చి రాములు, జారే సాయి, పద్దం సుగుణ, జారే కృష్ణవేణి, తాటి ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి నామినేషన్ల స్వీకరణ




**ప్రజాపక్షం/పెనుబల్లి:** డిసెంబర్ 17 న జరగనున్న పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు నామినేషన్ ల పర్వం మొదలు అయింది. మంగళవారం ఉదయం పదిన్నర నుండి శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుంది. మండలంలో మొత్తం 32 పంచాయతీలకు గాను 290 వార్డు మెంబర్లకు ఎన్నికలు జరగనున్నాయి. అందులో భాగంగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. ఎన్నికల అధికారులు నామినేషన్ కేంద్రాల్లో తగు ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం లోపు పూర్తి చేయనున్నారు. మండలంలో మొత్తం తొమ్మిది నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో సాయంత్రం 5 గంటలకు నామినేషన్ కేంద్రం ప్రాంగణంలో ఉన్న అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు అనుమతిస్తారు. అభ్యర్థులతో పాటు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉన్నట్లు అధికారులు తెలిపారు. లింగగూడెం, పెనుబల్లి, తాళ్లపెంట, లంకపల్లి, రామచంద్రరావు బంజార, తెలగవరం, చింతగూడెం, బయ్యనగూడెం, కోంద్రుపాడు పంచాయతి కార్యాలయాల్లో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీలు గుంపులు గుంపులుగా రాకుండా శాంతి పద్ధతులకు భంగం కలగకుండా ఎన్నికల అధికారులకు సహకరించాలని పోలీస్ శాఖ సూచించింది.


## మొక్కజొన్న విత్తన కంపెనీల నుండి అగ్రిమెంట్లు తీసుకోవాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం అష్ణగుర్తి గ్రామంలో మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి దసరి పుల్లయ్య, వైరా డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణ, వైరా మండల వ్యవసాయ అధికారి నయాన్ మంజుఖాన్ పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. మొక్కజొన్న రైతులతో అగ్రిమెంట్ లేకుండా విత్తన మొక్కజొన్న సాగు చేయకూడదని కంపెనీ నుండి తప్పనిసరిగా అగ్రిమెంట్ తీసుకోవాలని సూచించారు. వరి కోత కోసిన పొలాలను సందర్శించి రైతులు వరికోత చేపట్టిన తర్వాత వరి కొయ్యలను కాల్చవద్దని కోసిన తర్వాత నీరు పెట్టి కలియదున్నాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి ఏఈవో వాసంతి, వెంపటి నాగేశ్వరరావు, తాళ్ళ శ్రీనివాసరావు, పయ్యావుల చారి తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పోరుకు నేటి నుంచి నామినేషన్లు..!

**-అభ్యర్థుల ఎంపికకు తీవ్ర కసరత్తు**
**-వేడెక్కిన పంచాయితీ రాజకీయం**




**ప్రజాపక్షం/జూలూరుపాడు :** పల్లెపోరుకు నేటినుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో పల్లెల్లో పంచాయితీ ఎన్నికల సందడి ఊపందుకుంది. పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీకాగా, మూడవ విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి. పంచాయితీ ఎన్నికలు సర్పంచుల భవిష్యత్ రాజకీయాల్లో పార్టీ బలోపేతంలో కీలకం కానున్నారు. దీంతో అన్ని పార్టీలు బలమైన అభ్యర్థులను బరిలో నిలుపాలని భావిస్తున్నాయి. అలాగే, ప్రధాన పార్టీల మద్దతుతో పోటీ చేస్తే ఆర్థిక వెసులుబాటు కలగనుండటంతో పాటు విజయావకాశాలు ఎక్కువగా ఉండటంతో ఆశావహులు ముఖ్య నాయకుల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. ఆశావాహుల సంఖ్య అధికంగా ఉండటంతో పోటీలో ఎవరిని నిలిపితే బాగుంటుంది. గెలిచే అవకాశాలు ఎవరికున్నాయనే దిశగా పార్టీలు అభిప్రాయ సేకరణ చేపడుతున్నాయి. ఇందుకు గ్రామాలు, సామాజికవర్గాల వారీగా పార్టీ క్యాడర్తో సమావేశాలు నిర్వహిస్తూ అభ్యర్థుల బలబలాలపై ఫీడ్ బ్యాక్ తీసుకునే పనిలో పడ్డాయి. దీంతో పల్లె రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

### అభ్యర్థుల ఎంపికకు తీవ్ర కాసరత్తు..

త్వరలోనే పరిషత్ ఎన్నికలు జరగనుండటంతో పంచాయితీ ఎన్నికల్లో సత్తా చాటాలని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయి. ఇందుకోసం బలమైన అభ్యర్థులను సర్పంచ్ గా బరిలో నిలిపేందుకు కసరత్తు చేస్తున్నాయి. రిజర్వేషన్లకు అనుగుణంగా గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్నాయి. జనరల్ స్థానాల్లో ఆర్థిక, అంగబలమున్న వారిపై దృష్టి సారించాయి. రిజర్వ్డ్ స్థానాల్లో సామాజికవర్గాల వారీగా గ్రామస్తులతో నాయకులు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. బలమైన అభ్యర్థులు లేని చోట ఇతర పార్టీల్లోని గెలిచే అవకాశమున్న వారిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా యువ నాయకులపై ప్రత్యేక దృష్టి సారించారు.

ప్రజల్లో వారికున్న పలుకుబడి, ఆర్థిక స్థిరత్వం కలిగిన అంశాలను బేరీజు వేస్తున్నారు. దీంతో ఆయా పార్టీల ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జీలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ప్రధానంగా అధికార పార్టీలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా ఆయా పార్టీల క్యాడర్లో చర్చోపచర్చలు జరుగుతున్నాయి.

### పెద్ద ఎత్తున నిధులు రానుండడంతో....

సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి దాదాపు రెండేళ్లవుతోంది. పాలకవర్గాలు లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు అందాల్సిన ఎస్ఎఫ్సీ, ఎఫ్ఎఫ్‌సీ నిధులు పూర్తిగా నిలిచాయి. కొత్త పాలకవర్గాలు కొలువుదీరాక పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదలయ్యే అవకాశముంది. దీంతో ఈసారి సర్పంచ్‌గా బరిలో నిలిచేందుకు ఆశావహులు ఉత్సాహం చూపుతుండగా ఇందులో యువతే ఎక్కువగా ఉండడం గమనార్హం. రెండేళ్లుగా ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. నామినేషన్ ఎప్పుడు వేద్దామా అన్నట్లుగా ఎదురుచూస్తున్నారు. ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండగా అభ్యర్థుల ఎంపిక పార్టీలకు తలనొప్పిగా మారనుంది. ఒకరిని ఎంపిక చేస్తే మరొకరు రెబల్‌గా బరిలో నిలిచే అవకాశాలు న్నాయి. దీంతో గ్రామంలోని ముఖ్య నాయకులతో సమావేశమై మెజార్టీ అభిప్రాయాలకు తగినట్లు అభ్యర్థిని నిలిపేందుకు నేతలు ప్రయత్నిస్తున్నారు.

### ఏకగ్రీవం దిశగా యత్నాలు..

సర్పంచ్ ఎన్నికల బరిలో నిలువాలనుకునే అభ్యర్థులు నువ్వా..? నేనా..? అన్నట్లుగా పోటీ పడుతుండగా కొన్నిచోట్ల ఏకగ్రీవం చేసుకోవాలని గ్రామస్తులు ఆలోచిస్తున్నారు. బలంగా, ఐక్యంగా ఉన్న చోట తమకు అనుకూలమైన వ్యక్తిని సర్పంచ్ గా ఎన్నుకోవాలని భావిస్తున్నారు. తాజాగా జూలూరుపాడు మండలపరిధిలోని వెంగన్నపాలెం పంచాయితీలోని ప్రధాన పార్టీల నాయకులు, కాంగ్రెస్ సర్పంచ్, బిఆర్ఎస్ ఉపసర్పంచ్, వార్డుల వారీగా ఎకగ్రీవం చేసుకునేలా తీవ్ర కసరత్తులు చేస్తు అభ్యర్థిని ఎంపిక చేసుకోగా దాదాపు సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లే అని భావిస్తున్నారు. కానీ వెంగన్నపాలెం గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో వెంగన్నపాలెం పంచాయితీ ఏకగ్రీవం అవుతుందా.. ఎన్నికలు జరుగుతాయా అని వేచి చూడాలి.


## సర్పంచ్ అభ్యర్థి భర్తపై ఖాకీల జులుం..!

**-అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడిని కలవాలని హుకుం**




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి రగులుకుంది. సోంపల్లి గ్రామ పంచాయితీలో పుష్కలంగా ఇక్కడ ఇసుక వనరులు ఉన్నాయి. అదే స్థాయిలో ఇక్కడా రాజకీయం వేడి మొదలైంది. ఇటీవల సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నిక నియమావళి ప్రకారం పలువురు నామినేషన్లు వేశారు. అయితే ఈ క్రమంలో ఓ గిరిజన సర్పంచ్ అభ్యర్థి భర్తను రాజకీయ అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ సర్పంచ్ అభ్యర్థి భర్తను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధించినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. శాంతి భద్రతల పరిరక్షణ పేరుతో పిలిపించి, లోపల మాత్రం రాజకీయ పంచాయితీ చేయడం కోసం ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈసందర్భంగా అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడికి కలవాలని పోలీసులు సదరు వ్యక్తికి హుకుం జారీ చేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓ ప్రభుత్వ అధికారిగా ఉండి, అధికార పార్టీ నేతలకు ఏజెంట్లుగా వ్యవహరించడంపై మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక వనరులు ఉన్న గ్రామం కావడంతో, ఆధిపత్యం కోసం అధికార పార్టీ నేతలు పోలీసులను అడ్డం పెట్టుకొని ప్రత్యర్థులను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని విశ్లేషకులు, గిరిజన ప్రజలు తెలుపుతున్నారు. ఈ విధంగా ఓ పార్టీ సర్పంచ్ అభ్యర్థి భర్తను పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన తీరుపై గిరిజన గ్రామంలోని ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు పోలీసులు ఇలా వ్యవహరించడం ఏమిటని, ఏకపక్షంగా అధికార పార్టీకి కొమ్ముకాయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, లేని పక్షంలో బూర్గంపాడు మండలంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు తెలుపుతున్నారు.

## కీలక ఘట్టం కానున్న నామినేషన్ల ఉపసంహరణ..!



**ప్రజాపక్షం/అశ్వాపురం:** స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో భద్రాద్రి జిల్లాలో మొదటి విడతగా జరుగుతున్న మండలాల్లో భాగంగా అశ్వాపురం మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లు ముగిసిన తర్వాత నేడు జరగనున్న ఉపసంహరణ దశ ఎంతో కీలక ఘట్టంగా ఉంటుంది. ఈ దశలో రాజకీయ పార్టీలకు అతీతంగా కొన్ని శక్తులు, స్థానిక ప్రభావంతులు, గుంపులు లేదా వర్గ ప్రయోజనాలు పని చేస్తున్నాయని అనేక ప్రాంతాల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరి ప్రభావంతో అభ్యర్థులపై ఒత్తిడి పెరగడం, బలవంతపు ఉపసంహరణలు జరిగే అవకాశాలు కనిపించడం వంటి పరిస్థితులు ఉద్రిక్తతలకు దారి తీస్తున్నాయనడంలో సందేహం లేదు. పార్టీల స్వతంత్రతకు అతీతంగా ఆధిపత్యం, భూవివాదాలు, వ్యాపార ప్రయోజనాలు, గ్రామ రాజకీయాలు లేదా వ్యక్తిగత విరోధాలు వంటి కారణాలతో జోక్యం చేసుకుంటాయని ఈ జోక్యం వల్ల నిజాయితీగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు వెనక్కి తగ్గక తప్పని పరిస్థితి. ఇలా ఏర్పడే అస్వస్థ వాతావరణం ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీయడమే కాకుండా, గ్రామ అభివృద్ధి దశలో ప్రజలు తగిన ప్రతినిధులను ఎన్నుకునే అవకాశాన్ని కూడా తగ్గిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా ఉండేలా అధికారులు, పర్యవేక్షణ సంస్థలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం అత్యవసరం. మండలంలో బుధవారం ఉపసంహరణ ఘట్టం కీలకం కానున్నందున అభ్యర్థులకు రక్షణ కల్పించడం, బెదిరింపులు, ఒత్తిడులపై వెంటనే చర్యలు తీసుకోవడం, గ్రామ స్థాయి ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛా, నిష్పాక్షికంగా కొనసాగించేందుకు చర్యలు మరింత బలపడాలని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటే మంచిదని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## నేడు ప్రెసిడెంగ్ అధికారులకు శిక్షణ



**ప్రజాపక్షం/మణుగూరు:** గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు 2025 నిర్వహణలో భాగంగా మణుగూరు మండల పరిధిలో నియమించబడిన ప్రెసిడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నేడు (బుధవారం) మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు మణుగూరులోని కిన్నెర కళ్యాణ మండపంలో నిర్వహించబడుతుందని మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ (ఎంపిడిఓ), సహాయ జిల్లా ఎన్నికల అధికారి (ఏడిఈఏ) తెల్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణను ఒక్క సెషన్‌గా మధ్యాహ్నం ఏర్పాటు చేయడం ద్వారా పాఠశాలల పనితీరుకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోబడినవి అన్నారు. ఎన్నికల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శకత, సజావైన వ్యవస్థను నిర్ధారించడానికి ఈ శిక్షణ అత్యంత కీలకమైంది అన్నారు. ఈ సందర్భంలో మణుగూరు మండలంలోని వివిధ శాఖల్లో విధులు నిర్వహించే, శిక్షణ కోసం నియమించబడిన ఉద్యోగులందరూ పై సూచించిన శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావలసిందిగాఎంపిడిఓ కోరారు. శిక్షణలో పాల్గొనడం ప్రతి ప్రెసిడింగ్ ఆఫీసర్ యొక్క బాధ్యత, ఎన్నికల ప్రక్రియ విజయవంతం కావడానికి ఇది అత్యంత అవసరం అన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్రీడాపోటీలు

**జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్**




**ప్రజాపక్షం/మణుగూరు:** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం 2025 సందర్భాన్ని పురస్కరించుకొని ఈ నెల 3వ తేదీన ఉదయం 10.00 గంటలకు పివి కాలనీ భద్రాద్రి స్టేడియం నందు సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు (దివ్యాంగులకు) క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవసర పిల్లలలో ఆత్మ స్థైర్యాన్ని నింపి వారిని ప్రోత్సహించేందుకు గాను క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ క్రీడాపోటీలు మానసిక వికలాంగులకు, శారీరక వికలాంగులకు వారికి అనువైన పద్ధతిలో రన్నింగ్ రేస్ బాల్ త్రో, లాంగ్ జంప్ వంటి సులువైన 7 ఆటలను ఆడించడం జరుగుతుంది అన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం కూడా అందజేయడం జరుగుతుంది అన్నారు. కాబట్టి మణుగూరు ప్రాంత దివ్యాంగుల పాఠశాలల విద్యార్థులు, ఇతర దివ్యాంగులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవాలని ఆయన తెలిపారు.

## తిమ్మకపేట సర్పంచ్ రేపాకల సుభద్ర ఏకగ్రీవం




**ప్రజాపక్షం/ తిరులాయపాలెం :** మండలంలోని తిమ్మకపేట మిత్రపక్షాల అభ్యర్థి రేపాకుల సుభద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిమ్మకపేట గ్రామపంచాయతీ జనరల్ రిజర్వేషన్ అవడం బిసి సామాజిక వర్గానికి చెందిన మహిళను ఎన్నుకోవడం ప్రజలంతా గ్రామ అభివృద్ధిని కోరుకుంటున్నట్లు భావిస్తున్నారు. తిమ్మకపేట మొత్తం గ్రామపంచాయతీలో 523 ఓటర్లు ఉండగా ఎనిమిది వార్డుల్లో పురుషులు 247 ఉండగా మహిళలు 276 మంది ఉన్నారు. గ్రామపంచాయతీలో కాంగ్రెస్ బిఆర్ఎస్ ప్రజాపంథా మాస్ లైన్ పార్టీల నాయకులు ఏకాభిప్రాయంతో గ్రామ ప్రజల అభీష్టం మేరకు రేపాకులు సుభద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగీవ్రంగా ఎన్నికైన రేపాకుల సుభద్ర మాట్లాడుతూ నా మీద నమ్మకంతో గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనునిత్యం గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## తేనేటి విందులో పాల్గొన్న ఎమ్మెల్సీ తాతా మధు



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధు మంగళవారం వైరాలో మాజీ ఎంపిపి బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు నివాసం నందు జరిగిన తేనేటి విందులో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో రాజకీయ పరిస్థితుల గురించి తాతా మధుసూదన్‌రావు బిఆర్ఎస్ కార్యకర్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, మాదినేని దుర్గాప్రసాద్, ఏదునూరి శ్రీను, నూకల వాసు, ఆదూరి ప్రేమ్, మిట్టపల్లి సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి



-బిసిలకు ఖమ్మం జిల్లాలో కేవలం 9% రిజర్వేషన్లు
-ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి శూన్యం
-ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ప్రజాపక్షం/వైరా: వైరా మండలం కెజి సిరిపురం నందు కామినేని శ్రీని వాసరావు నివాసంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జరుగుతుండగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గెలుస్తుందనుకున్న బిఆర్ఎస్ అభ్యర్థులను ప్రలోభాలకు గురిచేసి పార్టీ మార్పించడం దౌర్భాగ్యమన్నారు. ఎన్నికల్లో విజయవం కోసం అధికార పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకురావడం, నామినేషన్లు విత్‌డ్రా చేయాలని బెదిరించడం వంటివి గతంలో ఎన్నడూ జరగలేదని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. కామారెడ్డిలో 42% బిసి రిజర్వేషన్లు ఇస్తామని డిక్లరేషన్ చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఖమ్మం జిల్లాలో కేవలం 9% రిజర్వేషన్లు మాత్రమే ఇచ్చి బిసిలను మోసం చేసిందని మండిపడ్డారు. ఈ జిల్లాలో అత్యధిక బిసి జనాభా ఉన్న రఘునాథపాలెం(వ్యవసాయ శాఖమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం), తిరుమలాయపాలెం(రెవిన్యూ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం) వంటి మండలాల్లో బిసిలకు జీరో రిజర్వేషన్లు ఇచ్చారు. ఇది బిసిలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది అని అన్నారు. దమ్ముంటే 42% బిసి అభ్యర్థులకు టికెట్లు కేటాయించి శ్వేతపత్రం విడుదల చేయాలని మంత్రులను డిమాండ్ చేశారు. తాజాగా నేలకొండపల్లి మండలం శంకరగిరి తండాలో గిరిన రైతు వీరన్న ఆత్మహత్య చేసుకోవడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ దీనిని ప్రభుత్వ హత్యగా అభివర్ణించారు. ప్రభుత్వ వైఫల్యం రుణమాఫీ, కౌలు రైతులకు భరోసా లేకపోవడం వంటి కారణాలు వల్లే రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, దీనికి జిల్లా మంత్రులు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పత్తికి కనీస మద్దతు ధర ఎంఎస్‌పి లేక రైతులు రూ.6వేలు కూడా కొనడం లేదని, మార్కెట్లపై మంత్రులకు నియంత్రణ లేకపోవడం దారుణమన్నారు. రుణమాఫీ, తులం బంగారం, స్కూటీలు, నిరుద్యోగ భృతి వంటి హామీలపై కాంగ్రెస్ నేతలు ప్రజలను మోసం చేశారని, ముఖ్యమంత్రి తన సొంత గ్రామంలో రుణమాఫీ నిరూపించలేక సవాళ్లను స్వీకరించలేని స్థితిలో ఉన్నారని విమర్శించారు. కెసిఆర్ పాలనలో కేంద్రం నుంచి 20 అవార్డులు వస్తే, 16–17 అవార్డులు తెలంగాణ గ్రామాలకు వచ్చేవని గుర్తు చేశారు కాని ఈ ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో పారిశుద్ధ్యం కుంటుపడి మురికి కాల్వల్లో చెత్త పేరుకుపోయి వైకుంఠధామాలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లకు డీజిల్ కొట్టలేని పరిస్థితి ఏర్పడిందని, ఇది అభివృద్ధిని అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నైజాన్ని, మోసాలను ప్రజలందరూ అర్థం చేసుకొని, బిసిలను, రైతులను, మహిళలను మోసం చేసిన ఈ ప్రభుత్వాన్ని స్థానిక ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన మీడియా ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వర రావు, టిఆర్ఎస్ పట్టణ నాయకులు రవి, మాదినేని ప్రసాద్, దొంతిబోయిన వెంకటేశ్వర్లు, కామినేని శ్రీనివాసరావు, సిరిపురం టిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి శెట్టిపల్లి శ్రీనివాసరావు, అయినాల కనకరత్నం, పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# జిపివోల సమస్యల పరిష్కారమే లక్ష్యం

-జిపివోల సంఘం జిల్లా అధ్యక్షులుగా నాగేంద్రబాబు






ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : జిపివోల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ ఏర్పాటు చేయడం జరిగిందని టిజిటిపి భద్రాద్రి జిల్లా అధ్యక్షులు కోట రవికుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తూమాటి శ్రీనివాసరావు లు తెలిపారు. జిపివో (గ్రామ పాలన అధికారి) సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా చీమల నాగేంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో టిజిటిపి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కోట రవికుమార్, టిజిటిపి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తూమాటి శ్రీనివాసరావు, టిజిఆర్ఎస్ఏ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీ ఆధ్వర్యంలో జిపివోల సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి, కో కన్వీనర్ కె. రామకృష్ణ, తెలంగాణ గ్రామ పాలన అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు సూచనల మేరకు జిల్లా కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్రామ పాలన అధికారులు ప్రజా ప్రభుత్వం ఆశయాన్ని నెరవేర్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో కృషి చేసేందుకు ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. గ్రామ పాలన ఆఫీసర్స్ సమస్యల పరిష్కారం కోసం సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా జిపివో సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా చీమల నాగేంద్రబాబు, మహిళా విభాగం అధ్యక్షులుగా పడిగ హైమావతి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా షేక్ జానిమియా, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షునిగా మందేరుకుల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బాల మురళీకృష్ణ, కోశాధికారిగా వజ్జా రామారావు, అసోసియేట్ అధ్యక్షులుగా చల్లా శ్రీనివాసరావు, మక్కాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా బానోత్ రాంచందర్‌రావు, టిఎంఎం కిషోర్, మల్లెంపాటి వెంకటేశ్వర్లు, కోట నరేష్ లను ఎన్నుకున్నారు. మహిళా అధ్యక్షురాలిగా పడిగ హైమావతి, బానోత్ జమ్ము, ఉపాధ్యక్షురాలిగా అంకోలు శ్రీలక్ష్మి, తాటి ఇందిర, కుంజా రాధారుక్మిణి, శ్రీవాణి, బానోత్ స్వప్నలను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీకి సంబంధించి జిల్లా సహాయ కార్యదర్శులను, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ప్రచార కార్యదర్శి, సంస్కృతిక కార్యదర్శి, ఈసీ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన చీమల నాగేంద్రబాబు మాట్లాడుతూ తన పై నమ్మకంతో జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిపివోల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రాచకొండ నాగలక్ష్మి , జిపివోలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఏర్పాట్లు పూర్తి



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో మూడో విడత ఎన్నికలు మూడో తేదీ నుండి 5వ తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ 17వ తేదీన పోలింగ్ జరుగుతున్నందున ఎన్నికల అధికారులు, సహాయక ఎన్నికల అధికారులు మంగళవారం 40 రకాల ఎన్నికల మెటీరియల్‌ను సిద్ధం చేసుకుని పోలింగ్ కేంద్రాలకు చేరారు. 46 మంది ఎన్నికల అధికారులు, 10 కంప్యూటర్ ఆపరేటర్లు నామినేషన్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎన్నికల మండల పరిశీలకులుగా వేల్పుల విజేత, సహాయ ఎన్నికల అధికారులు చంద్రశేఖర్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

# స్థానిక సమరంలో 'ఆమె' కీలకం..!



ప్రజాపక్షం/కల్లూరు: మండల పరిధిలోని గ్రామ పంచాయతీ ఎన్నికలలో మూడో విడత 17 తేదీన జరగనున్న ఎన్నికల్లో ప్రతి వార్డులను గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలలోనూ మహిళల చేతుల్లోనే గెలుపు కీలకం కానుంది. ఇప్పటికే వార్డులోనూ సర్పంచ్ ఎన్నికల్లోను అధికంగా మహిళా ఓటర్లు అధికంగా ఉండటంతో వారి చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలలో పోచవరం, తెలగవరం గ్రామపంచాయతీలలో తప్ప మిగతా గ్రామపంచాయతీలలో అధికంగా మహిళా ఓటర్లు ఉండటంతో వారు ఓట్లు కీలకమయ్యాయి. పురుషులు కన్నా స్త్రీ ఓటర్లు గెలుపులో కీలక పాత్ర ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, నమ్మకంతో ఓటర్ల జాబితాను పట్టుకొని ప్రత్యేకంగా జల్లెడబడుతూ వల వేస్తున్నారు. మండల పరిధిలోని బత్తుల పల్లి, చండ్రుపట్ల, చెన్నూరు, చిన్న కోరుకొండి, ముచ్చవరం, ముగ్గు వెంకటాపురం, పెద్ద కోరుకొండి ,పేరు వంచ, యజ్ఞ నారాయణపురం, తాళ్లూరు వెంకటాపురం, ఎర్ర బోయినపల్లి తదితర గ్రామాలలో అధిక ఓటర్లు మహిళలు ఉండటంతో నాయకులు, కార్యకర్తలు చూపులు మహిళలపై మండలం లో మొత్తం 214 వార్డులలో 18,166 మహిళా ఓటర్లు ఉండగా పురుషులు 17,364 ఉన్నారు స్థానిక గ్రామపంచాయతీ పోరులో ఆమెదే కీలకం కావడంతో నాయకులు అభ్యర్థులు చూపులు మహిళల చేతుల్లోనే గెలుపుకి ఉందని మహిళా ఓటర్ల జాబితా పట్టుకొని ఇంటింటికి ఫోన్ నెంబర్లు తీసుకుని సమాచారాన్ని తెలుపుతున్నారు. మరికొందరు నేరుగా ఇంటింటికి వెళ్తున్నారు. అధిక శాతం మహిళలకు రిజర్వేషన్ కావడంతో సర్పంచులు వార్డులు కూడా వారిదే అధిక స్థానం కానుంది.

# మున్సిపాలిటీ కార్మికులు వేతనాల కోసం నిరవధిక సమ్మె నోటీస్




ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మున్సిపాలిటీ కార్మికులు వేతనాలు కొరకు సమ్మె నోటీసులు మున్సిపాలిటీ కమిషనర్ కు మంగళవారం అందించారు. గత ఆరు నెలలుగా మున్సిపాలిటీ నూతనంగా ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఆరు నెలలు పూర్తయిన కూడా వేతనాలు అందక పోవటంతో సమ్మె నోటీసును మున్సిపాలిటీ కార్యాలయంలో మేనేజర్ నాగేశ్వరరావుకు కార్మికులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటి యుసి జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులకు గత ఆరు నెలలుగా పెండింగ్ రూ. 79 లక్షలు ఉండగా ఒక్కొక్కరికి రూ. 87,000 రావాల్సి ఉంది కార్మికులు వేతనాలు రానందున అప్పుల పాలై కుటుంబాలు భారంగా మారాయని గతంలో జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలకు, వినతి పత్రాలు ద్వారా తెలియపరచిన కూడా స్పందన లేకపోవడంతో మంగళవారం నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగిందని, సుమారుగా 100 మంది కార్మికులు గత ఆరు నెలలుగా పస్తులు ఉంటూ కుటుంబం గడవక అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నారని, 18వ తేదీ నుండి విధులు పూర్తిగా బహిష్కరిస్తూ సమ్మెకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. గత్యంతరం లేక నిరవధిక సమ్మెలోకి వెళ్ళటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దామాల దయాకర్ రావు, జిల్లా నాయకులు మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఊడల కృష్ణమూర్తి, కార్యదర్శి వజీర్మియా, ప్రకాష్, చింత పంటి శ్రీను, సుధాకర్, ప్రవీణ్ , నరసింహారావు యశోద ,సీతమ్మ, లతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా స్టూడెంట్ స్కిల్ టెస్ట్ ఫర్ సోషల్ కాజ్ క్విజ్ పోటీ



ప్రజాపక్షం/వైరా: న్యూలిటిల్ ఫ్లవర్స్ స్కూల్‌లో స్టూడెంట్ స్కిల్ టెస్ట్ ఫర్ సోషల్ కాజ్ అనే శీర్షికతో పూర్ ఫౌండేషన్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నసీర్ షేక్, ఉపాధ్యక్షురాలు షాదాన్ నసీర్, ప్రధాన కార్యదర్శి సమీర్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భూమేష్, ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ భూమేష్ బహుమతులను అందజేశారు. ఈ క్విజ్ పోటీ ఒక సామాజిక సేవా ఉద్దేశ్యంతో నిర్వహించబడిందని నిర్వాహకులు తెలిపారు. గెలుపే ముఖ్యమని కాకుండా ప్రతి విద్యార్థి పాల్గొనడం ద్వారా సమాజంలో మార్పుకు బాట వేయడం ప్రధాన లక్ష్యమని అన్నారు. 2021 నుంచి నిరంతరంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న పూర్ ఫౌండేషన్ సేవా సొసైటీ ఈ కార్యక్రమం ద్వారా తన సేవా సంకల్పాన్ని మరోసారి చాటుకుంది. 1వ బహుమతి షేక్ సలీమ్‌పాషా, 2వ బహుమతి జి.తనీష్, 3వ బహుమతి మహీధర్, విజేతలు వివరాలు కళాశాల విభాగం 1వ బహుమతి షేక్ సమీర్, 2వ బహుమతి పి.రాధిక, 3వ బహుమతి కె.గాయత్రి విజేతలకు పూర్ ఫౌండేషన్ సేవా సొసైటీ తరపున అభినందనలు తెలియజేశారు.

# ప్రభుత్వ పెద్దల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి

**- ఎర్త్ యూనివర్సీ ఏర్పాటు అభినందనీయం**
**- ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహాయ సహకారాలతో కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి పథంలో సాగుతోందని, రాబోయో రోజుల్లో మరిన్ని నిధులను తీసుకొచ్చి పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని కొత్తగూడెం శాశన సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. బుధవారం డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మక భూ విజ్ఞాన విశ్వవిద్యాలయం (ఎర్త్ యూనివర్సిటీ) ని ఏర్పాటు చేయడం, దానికి భారత మాజీ ప్రధాని డా. మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం అభినందనీమని చెప్పారు. దీంతో భద్రాద్రి జిల్లా ఖ్యాతి దేశ విదేశాలకు చేరుకుందని, ప్రపంచ దేశాల నుండి చదువుకునేందుకు ఇక్కడికి తరలివస్తారని చెప్పారు. ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఇది చక్కటి ప్రాంతమని, ఈ ప్రాంత భూముల్లో విలువైన ఖనిజ సంపద నిక్షిప్తమై ఉండటంతో భూ విజ్ఞాన పరిశోధనలు చేసేందుకు చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు. యూనివర్సిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతం విద్యా పరంగా ప్రపంచ పటంలో నిలవబోతోందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ యూనివర్సిటీని విద్యార్థులు ఉపయోగించుకుని దేశానికి సేవ చేయాలన్నారు. అదే విధంగా 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని పాల్వంచలో నెలకొల్పేందుకు ప్రభుత్వం సుముకంగా ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు పనులు త్వరిత గతిన పూర్తి చేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాని, విమానాశ్రయం ఏర్పాటుకు మరింత చొరవతీసుకుని ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతంలోన మరికొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు సహకరించాలని, ప్రతీ సమస్యపై సమగ్ర సమాచారంతో నివేదికలు తయారు చేసి త్వరలో ప్రభుత్వానికి అందిస్తామన్నారు.

# సిపిఐ అభ్యర్థులను గెలిపించాలి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్, వార్డు మెంబర్లుగా సిపిఐ తరుపున నామినేషన్లు వేసిన అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని గూడూరుపాడు పంచాయతీలో నామినేషన్ దాఖలు చేస్తున్న కస్నాతండా సర్పంచ్ అభ్యర్థి నామినేషన్‌లో సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సిపిఐ అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజలకు సుపరిపాలన అందడంతో పాటు పల్లె అభివృద్ధి పథంలో కొనసాగుతుందన్నారు. కావున ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు. అలాగే పోటీ చేస్తున్న సిపిఐ గ్రామాలను పరిశీలించి,అక్కడి నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# నేటి నుండి మూడో విడత నామినేషన్లు

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** గ్రామపంచాయితీ ఎన్నికల్లో భాగంగా మూడో విడత నామినేషన్లు బుధవారం నుండి స్వీకరించనున్నారు. ఆళ్లపల్లి, గుండాల, జూలూరుపాడు, సుజాతనగర్, లక్ష్మీ దేవిపల్లి, ఇల్లెందు మండలాల్లోని 156 గ్రామపంచాయితీల్లో 1340 వార్డులకు కలిపి 3వ తేది మొదలుకుని 5వ తేది సాయంత్రం 5 గం.ల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 17వ తేదిన ఎన్నికలు నిర్వహిస్తారు. నేడు మొదటి విడతకు విత్‌డ్రాలు, రెండో విడతకు స్క్రూటినీ జరగనుంది.

# ముగిసిన రెండవ విడత నామినేషన్లు

**-నేడు మొదటి విడత ఉపసంహరణకు గడువు**
**-తుది దశకు నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రెండవ విడత నామినేషన్ల స్వీకరణ మంగళవారంతో ముగిసింది. రెండవ విడతలో కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాలకు సంబంధించి 183 గ్రామ పంచాయతీల పరిధిలోని 1686 వార్డులకు రెండవ విడత ఈనెల 14న ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించి నవంబర్ 30 నుంచి డిసెంబర్ రెండు వరకు నామినేషన్లను స్వీకరించారు. సోమవారం వరకు 183 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు 428, 1686 వార్డు స్థానాలకు 931 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం చివరి రోజు సర్పంచ్, వార్డు స్థానాలకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. అర్థరాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. మొదటి విడతకు సంబంధించి బుధవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. మూడవ విడత (తుది)కు సంబంధించి ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వేంసూరు, సింగరేణి మండలాల పరిధిలోని 191 గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ స్థానాలకు, 1742 వార్డు స్థానాలకు బుధవారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. మూడవ విడతకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు ఈనెల ఐదు వరకు గడువు ఉంది. ఈనెల 17న తుది విడతకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయి.

# గుండెపోటుతో సింగరేణి కార్మికుడి మృతి



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు ఏరియా సింగరేణి జెకె 5 ఓసిలో జనరల మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్న పాల్వాయి శ్రీనివాసులు(59)మంగళవారం ఉదయం ఎప్పటిలాగే డ్యూటీకి వెళ్ళగా మధ్యాహ్నం ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అది గమనించిన తోటి సింగరేణి కార్మికులు అతడిని సింగరేణి ఆసుపత్రికి తరలించగా అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గతంలో శ్రీనివాస్‌కు గుండెనొప్పి రావడంతో 2011లో స్టంట్ వేయడం జరిగింది. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. శ్రీనివాసులు మృతి పట్ల ఏఐటియూసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ఫిట్ సెక్రటరీ నాదెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఐఎన్‌టియూసి బ్రాంచ్ కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, గోచికొండ సత్యనారాయణ, కొండూరు చిన్ని, టీబీజీకేఎస్ నాయకులు జాకీర్ హుస్సేన్ మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్మికుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గం

**-మాజీ ఎంఎల్ఏ హరిప్రియ నాయక్**




**ప్రజాపక్షం/ఇల్లందు:** అణిచివేయాలని చూస్తే మరింత రెట్టింపు ఉత్సాహంతో ప్రజాక్షేత్రంలో పని చేస్తామని మాజీ ఎంఎల్ఏ, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. మంగళవారం బిఆర్ఎస్ నాయకులను ఇల్లందు పోలీస్ స్టేషన్‌లో అరెస్టు చేసి తీసుకెళ్లడం పట్ల ఆమె ఘాటుగా స్పందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం పర్యటన కోసం ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పంచాయితీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనలు చేయడం అనేది పూర్తిగా విరుద్ధమన్నారు. కోడ్ అమలులో ఉండగా మరోవైపు పర్యటన ఎలా చేస్తారని ప్రశ్నించారు. గ్రామ పంచాయితీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ నాయకులు దిగజారుడుతనానికి పాల్పడుతున్నారన్నారు. నవంబర్ 26న ఎలక్షన్ కమిషన్ కోడ్ అమలుపై స్పష్టత ఇచ్చిన తర్వాత కూడా ప్రభుత్వ ఖర్చుతో సమావేశాలు పెట్టడం సరికాదన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఎదురు ప్రశ్నిస్తారని, భయపడి ముందస్తు అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఇంత ఒత్తిడి చేసినా, నిర్భంధాలు గురి చేసిన ప్రజాక్షేత్రంలో రెట్టింపు ఉత్సాహంతో పని చేసి కాంగ్రెస్ పాలనను ఎండగడతామని హెచ్చరించారు.

# వీడిన మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ మిస్సింగ్ మిస్టరీ



**ప్రజాపక్షం/ఇల్లందు:** రెండు రోజుల క్రితం మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో భర్త నరసయ్య ఫిర్యాదు చేసిన విషయం విధితమే. అందరూ ఊహించినట్టుగానే సుభాష్‌నగర్ మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరింది. మంగళవారం కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయంలో ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ భర్త నరసయ్య పలువురు మాజీ వార్డ్ సభ్యులను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజా పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరే వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్క పేదవారికి ఇందిరమ్మ ఇల్లు, సంక్షేమ పథకాలను అంది స్తామన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి సైదులు, చిట్టిబాబు, సుదర్శన్ కోరి, ఆళ్ల నాగేశ్వరరావు, నరసింహారావు, రామచంద్రు, ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్టులు నమ్మవద్దు : అడిషనల్ డిసిపి







**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** డిజిటల్ అరెస్ట్‌లో ఉన్నారని డబ్బులు ఇస్తే విడుదల చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడే సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మిమోసపోవద్దని అడిషనల్ డిసిపి అడ్మిన్ భోజా రామానుజం అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన 'ఫ్రాడ్ కా ఫుల్‌స్టాఫ్' పేరుతో పోలీసు కమిషనర్ సునీల్‌దత్ పర్యవేక్షణలో స్థానిక పోలీస్ శిక్షణకేంద్రంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిపి రామానుజం పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత, బ్యాంక్ వివరాలు, ఓటిపిలు వంటి సమాచారాన్ని ఎవరితోను పంచుకోవద్దన్నారు. అపరిచిత, ఫోన్‌ద్వారా వచ్చిన అటాచ్ లింక్‌లను క్లిక్‌చేసి ఓపెన్ చేయవద్దని సూచించారు. డిజిటల్ అరెస్ట్‌లకు బయపడవద్దన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు నగదు బదిలిచేయమని మోసపూరిత మాటలతో ఫోన్ చేస్తే నమ్మి మోసపోవద్దన్నారు. మోసపోయినట్లు బావిస్తే వెంటనే సైబర్ క్రైం పోలీసులకు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని రామానుజం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సైబర్‌క్రైం ఏసిపి ఫణిందర్, సిఐ నరేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# లారీ ఢీకొని వస్త్ర వ్యాపారి మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** లారీ ఢీకొని వస్త్ర వ్యాపారి మృతి చెందిన సంఘటన ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని గుర్రాలపాడువద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఖమ్మంలోని పంపిగ్‌వెల్‌రోడ్డుకు చెందిన కూరపాటి వెంకటేశ్వర్లు(66) ద్విచక్రవాహనంపై బట్టల వ్యాపారం చేస్తుంటాడు. ఖమ్మం నుండి వెంకటగిరిక్రాస్‌రోడ్ మీదుగా కోదాడక్రాస్‌రోడ్ వైపు వెళుతుండగా గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద లారీ అతివేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు లారీ కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని మృత దేహానిన పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ ముష్కరాజు తెలిపారు.